

— వాణిశ్రీ

హైదరాబాద్‌లో ప్రముఖులైన డాక్టర్స్‌లో మనోహర్ అగ్రగణ్యుడు. ఆయన స్వంత హాస్పటల్లో అనుభవజ్ఞులైన స్పెషలిస్టులు ఎందరో పనిచేస్తున్నారు. సిటీలో ఆయనకి పెద్ద పేరుంది - మంచి డాక్టర్ అని.

ఆ రోజు శుక్రవారం. హాస్ప

టలో కూర్చుని టైము చూసు కున్నాడు. ఎనిమిదిదాటింది. ముసురు పట్టి వుండటం వల్ల హాస్పటల్ ఎక్కువ రష్‌గా లేదు.

ఇక వెళ్ళిపోదామని లేచాడు.

టెలిఫోన్ మ్రోగితే కూర్చుని రిసీవర్ ఎత్తాడు

బంగారు పట్నం నుంచి ట్రం కాల్ వచ్చిందనీ, పి. పి డాక్టర్ మనోహర్ అనీ చెప్పాడు ఆప రేటర్.

"పి. పి హోల్డాన్" అన్నాడు మనోహర్.

ఆపరేటర్ కనెక్షన్ ఇచ్చాడు.

"డాక్టర్ మనోహర్ స్పీకింగ్!" అన్నాడు గట్టిగా.

ఫోనులో అతని తండ్రి మరణ వార్త విని స్థాణువై పోయాడు.

'ఇంపాజిబుల్!' అని అరవా లనుకున్నాడు.

కాని అతను విన్నది నూటికి నూరుపాళ్ళు నిజమే!

రిసీవర్ క్రెడిల్ మీద పెట్టిన తర్వాత అతనికి కాళ్ళు చేతులు ఆడలేదు.

కారు పోర్టికోలో నిలిపిన తర్వాత డాక్టర్ ఎంతసేపటికీ రాక పోయేసరికి డ్రైవర్ లోపలికి వచ్చి చూశాడు.

"సార్! కారు రెడీ చేశాను" అన్నాడు డ్రైవర్ మెల్లిగా.

"డ్రైవర్! నువ్వు ఇంటికి వెళ్ళి అమ్మగారిని పిల్లల్ని తీసు కుని రా. మనం బంగారు పట్నం వెళ్ళాలి. నాన్నగారు చనిపోయా రని చెప్పు" అన్నాడు.

డ్రైవర్ తల వూపి వెళ్ళి పోయాడు.

## 2

బంగారు పట్నం మొదటినుంచీ నీటి కరువుకి ప్రసిద్ధి. అక్కడి బావులకు కొండపీటి చాంతాడు బావులని పేరు. అంత లోతుగా వుండేవి. ఎండాకాలం వస్తే నీటికి కటకటలాడిపోయేవాళ్ళు.

పదేళ్ళ క్రితమే నీటి సమస్య నుంచి బైటపడ్డారు ఆ పట్నం ప్రజలు. బంగారు పట్నంలో చెరు వులు వున్నా అవి ఎండాకాలానికి ఎండిపోయేవి. నదులు సమీపంలో లేవు. ముప్ఫై మైళ్ళ దూరంగా వుంది కృష్ణ.

రాష్ట్ర ప్రభుత్వం కృష్ణనుంచి కాలువ త్రవ్వించింది. బంగారు పట్నం మునిసిపాలిటీ వూరి చివర కోనేరుకట్టించి, ఆ నీటిని పట్నంలో కట్టించిన టాంకర్లద్వారా వీధులకు సరఫరా చేశారు. ఇరవై నాలుగు గంటలూ పైపుల ద్వారా నీళ్ళు

రావటం ప్రజలకు ఎంతో ఆనందం కలిగించింది.

పూరికి నాలుగు ముఖ్య భాగాలలో, రెండు వందల అడుగుల ఎత్తులో, ఎన్నోలక్షల గాలన్ల నీరు నిలువ చేసిన వాటర్ టాంకర్స్ బంగారు పట్నానికే నూతనశోభను చేకూర్చాయి.

ఆ రోజు శుక్రవారం.

వారం రోజుల నుంచి కుండపోతగా కురిసిన వర్షం తెరిపి ఇచ్చింది.

జనం రోడ్లమీద మామూలుగా తిరగసాగారు.

జగపతిరావు అరవైలో పడినా తను పాటిస్తున్న ఆరోగ్య సూత్రాల వల్ల ఆరోగ్యంగా వున్నాడు. తను ఎంత ధనవంతుడైనా వూళ్ళో ఎక్కడికి వెళ్ళాలన్నా నడిచి వెళ్ళడం ఆయన ఆరోగ్య సూత్రాలలో ఒకటి. అతనికారు ఎప్పుడూ షెడ్‌లోనే వుంటుంది. ఎప్పుడైనా అతని భార్యగాని ఇంటికి వచ్చిన బంధువులు గాని వాడతారు.

అతని ఏకైక సంతానం డాక్టర్ మనోహర్. హైదరాబాదులో వుంటాడు.

ఆ రోజు సాయంకాలం ఆరు గంటలకు ఇంట్లోనుంచి బైటకు వచ్చాడు జగపతిరావు. బంగారు పట్నంలో ఏకైక ఎయిర్ కండిషన్ థియేటర్ శ్రీదేవిలో అతను మెయిన్ పార్టనర్. రోజూ కాసేపు థియేటర్‌లో కూర్చుని రావటం అలవాటు.

కాని థియేటర్ చేరలేక పోయాడు ఆరోజు. ఇంకో ఫర్లాంగు దూరంలో థియేటర్ వుందనగా పెద్ద పెద్ద చినుకులతో వర్షం ప్రారంభమైంది. కరెంటు పోయింది. జనం ఎక్కడివాళ్ళక్కడ రోడ్లమీదనుంచి చెల్లా చెదురయి పోయారు.

ఎక్కువ మంది సమీపంలోని వాటర్ టాంకర్ క్రింద తల దాచుకున్నారు. జగపతిరావుకూడా అందరితోపాటు వాటర్ టాంక్ క్రింద నిలుచున్నాడు.

ఇంతలో ఫెళ ఫెళా రవం వినిపించింది. ఎక్కడో పిడుగు పడిందని అనుకున్నారుగాని, పెను మృత్యువు వినాదంచేసిందని ఎవరూ అనుకోలేదు.

సిమెంట్ స్తంభాలు కూలి వాటర్ టాంకర్ తుత్తినియలై జనంమీద పడింది. ఆర్తనాదాలు గాలి వానలో కలిసిపోయాయి. వందలమంది ఆ ప్రమాదంలో మరణించారు, గాయపడ్డారు.

గంటతర్వాత వాన వెలిసింది.

కరెంటు దీపాలు వెలిగాయి.

జరిగిన ఘోరం టౌనులోని ప్రతి ఇంటికీ ప్రాకిపోయింది.

అంబులెన్స్‌లు ప్రమాదం జరిగిన స్థలానికి పరుగులెత్తాయి.

చచ్చిపోయిన వారిని తీసి ఒక ప్రక్కగా పడుకోబెడుతున్నారు.

గాయపడిన వారిని హాస్పటల్స్‌లో చేరుస్తున్నారు.

తమ చుట్టాల్ని గుర్తించిన వారి ఏడుపులతో, పెడబొబ్బలతో ఆ ప్రదేశం హృదయ విదారకంగా, స్మశాన వాటికలా తయారైంది.

## 3

లాయర్ ముకుందరావు ఆఫీసు రూమ్‌లో కూర్చుని కేస్ పైలు స్టడీ చేస్తుండగా బాయ్ వచ్చి విజిటింగ్ కార్డుఇచ్చాడు.

అది చూసి, "రమ్మను" అన్నాడు.

డాక్టర్ మనోహర్ ఆఫీసులోకి ప్రవేశించాడు

"గుడ్ మార్నింగ్ డాక్టర్!" అన్నాడు ముకుందరావు.

"రెండు రోజులనుంచి మిమ్మల్ని కలుసుకోవాలని అనుకుంటున్నాను కాని వీలు చిక్కడంలేదు" అన్నాడు డాక్టర్.

ముకుందరావు నవ్వాడు.

"మా ఫాదర్ జగపతిరావు మీకు తెలుసా? పరిచయముందా?" ప్రశ్నించాడు డాక్టర్

"ఆయన్ని తెలియనివారు ఈ వూళ్ళో ఎవరుంటారు? కాని పెద్ద పరిచయం లేదు నాకు తీరిక తక్కువ" అన్నాడు లాయర్, నవ్వుతూనే.

"ప్రాక్టీస్ బాగా వుంది మీకు. ఈ వూళ్లో లీడింగ్ లాయర్ మీరే అని విన్నాను."

"ఏదోలెండి!" మొహమాటంగా నవ్వాడు ముకుందరావు.

"నేను ముఖ్యమైన పని మీద వచ్చాను "

"చెప్పండి!"

"వాటర్ టాంక్ ప్రమాదంలో మా ఫాదర్ పోయారు."

"చాలా ఘోరం జరిగిపోయింది లెండి. నాకు ఊహ వచ్చినదగ్గర్నుంచి అంత పెద్ద ప్రమాదం చూడలేదు." విచారిస్తూ అన్నాడు ముకుందరావు.

"ఈ ఘోరం జరగటానికి బాధ్యులైనవారిని శిక్షించాలని నా కోరిక." గట్టిగా అన్నాడు డాక్టర్.

ముకుందరావు ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఈ ప్రమాదం మీద కోర్టుకి వెళ్లామని నాకు ఐడియా వచ్చింది." ఆవేశంతో అన్నాడు డాక్టర్.

"గుడ్ ఐడియా!" మెచ్చుకోలుగా అన్నాడు ముకుందరావు.

"థాంక్స్!" అన్నాడు డాక్టర్.

"ఎవరిమీద పెడదాం కేసు?"

"ఇంకెవరిమీద? మునిసిపాలిటీ మీద. వాళ్ళ ఇంజనీర్ల మీద."

ముకుందరావు ఆలోచనలో పడిపోయాడు.

"నాకు డబ్బు మీద వ్యామోహంతో ఈ కేసు పెడుతున్నానని మీరు అనుకోకండి. దాదాపు వంద మంది చనిపోయారు. వాళ్ళందరూ బీదవాళ్ళు. వాళ్ళకి ముఖ్యంగా నష్ట పరిహారం చెల్లించాలి."

"డిసీజ్ వెరీ వెరీ ఇంపార్టెంట్ పాయింట్" అన్నాడు లాయర్.

"ఫాదర్ సెర్మనీ విన్నే అయిపోయింది, రేపుకూడా వుంటాను. మీరు అఫిడవిట్ తయారు చెయ్యండి నేను సంతకాలు చేసి వెళ్ళిపోతాను. కేసు మీరే డీల్ చెయ్యాలి" అన్నాడు డాక్టర్.

"అలాగే" అన్నాడు లాయర్.

డాక్టర్ మనోహర్ కోటు జేబులో నుంచి పర్సు తీసి డబ్బు ఇస్తూ, "వుంచండి" అన్నాడు.

"ఇప్పుడెందుకు? తర్వాత చూద్దాం" అన్నాడు లాయర్.

"ఫరవాలేదు-వుంచండి" అని షేక్‌హేండ్ ఇచ్చి, "సీ యూ టుమారో ఈవెనింగ్" అన్నాడు.

ముకుందరావు లేచి డాక్టర్ వెంట పోర్టికోలో వరకూ వెళ్ళి సాగనంపాడు.

## 4

వాటర్ టాంక్ యాక్సిడెంట్‌లో మరణించిన పట్టణ ప్రముఖుడు జగపతిరావు కొడుకు డాక్టర్ మనోహర్, మునిసిపాలిటీ మీద నష్టపరిహారానికి దావా వేశాడని ప్రముఖంగా మొదటి పేజీలో ప్రచురించాయి దినపత్రికలు.

ప్రమాదంలో మరణించిన వారి గురించి సంతాపం తెలియ జేస్తూ నాయకులు చేసిన ప్రకటనలను విరసిస్తూ డాక్టర్ మనోహర్ ఒక పత్రికా ప్రకటన చేశాడు.

సానుభూతి తెలియజేసినంత మాత్రాన నాయకుల బాధ్యత తీరిపోదనీ, ఈ ప్రమాదం ఎందుకు జరిగిందో దర్యాప్తు జరిపించి దోషులని శిక్షించాలనీ, అలా చేస్తే భవిష్యత్తులో ఎంతో మేలు జరుగుతుందనీ అందులో సారాంశం.

కొన్ని పత్రికలు బంగారు పట్నం మున్సిపాల్టీ కట్టించిన వాటర్ టాంకులమీద సంపాదకీయాలే రాశాయి వాటిలో అది కట్టించిన ఇంజనీర్లను దుయ్యబట్టాయి.

బంజరు భూముల విక్రయంలో కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ అసెంబ్లీలో ప్రతిపక్షం వాళ్ళు చేసిన గొడవలే తల నొప్పిగా ఉన్నాయి మునిసిపల్ ఛైర్మన్ భీమాంజనేయరావుకి. మునిసి పాలిటీల మంత్రి రెండుసార్లు విజిట్ చేసి రాద్ధాంతంచేసి పోయాడు. అదే ఇంకా సద్దు మణగలేదు. ఈ లోపల ఈ వాటర్ టాంక్ యాక్సి డెంట్ జరిగింది.

'ఛీ-ఛీ! మన దశ వెనక్కి-తిరిగినట్లుంటుంద'ని చిరాకుపడ్డాడు గత పదిహేను సంవత్సరాలుగా ఛైర్మన్ పీఠాన్ని వదలకుండా కూర్చున్న భీమాంజనేయరావు.

జగపతిరావు కొడుకు డాక్టర్ మనోహర్ కోర్టులో దావా వెయ్యడంతో బెంబేలెత్తిపోయాడు. పత్రిక లన్నీ దుమ్మెత్తి పోస్తుండడంతో తన పరువు బజార్లో పడినట్లయింది. తలెత్తి తిరగలేక పోతున్నాడు. ఏడవలేక నవ్వుతున్నట్లయింది పరిస్థితి.

ఆ రాత్రి తన ఇంట్లో కౌన్సి ర్లలందర్నీ సమావేశ పరిచాడు. మునిసిపల్ కమీషనర్ని గూడా సలహాలు ఇవ్వమని ఆహ్వానించాడు. ఇంజనీర్లుకూడా వచ్చారు. అతనికి స్నేహితులైన సింహాల వంటి ప్లీడర్లు డిన్నర్కి హాజ రయ్యారు.

సోడాలు విస్కీ-లలో కలిసి గ్లాసుల్లో పొంగాయి. జీడిపప్పు ప్లేట్లు, చికెన్ బిర్యానీలు, ఫిష్కట్ లెట్లు, ఫ్రై మటన్ డిషెస్ సర ఫరా చెయ్యడంలో హడావుడి పడి పోగారు నౌకర్లు.

నవ్వులతో, కేరింతలతో, జోకు లతో నిండిపోయింది వాతావరణం.

ఛైర్మన్ భీమాంజనేయరావు లేచి విల్చుని ముందుగా తన ఆహ్వా నం మన్నించి వచ్చిన మిత్రులంద రికీ కృతజ్ఞతలు తెల్పుకున్నాడు. జగపతిరావు కొడుకు మునిసిపాలిటీ మీద వేసిన కోర్టుకేసు గురించీ, ఎలా బైట పడాలీ అని అంశం మీద సలహాలు ఇవ్వవలసిందిగా కోరాడు.

"అంతా ప్రకృతి వైపరీత్యం. గాలి వానలకి తట్టుకోలేక పడి పోయింది. భూకంపంవల్ల అది పడి పోయిందని మంత్రితో ప్రకటన ఇప్పిద్దాం" అన్నాడొక ముసలి కౌన్సిలర్.

"మనం కోర్టులో రికార్డుల రూపంలో ఋజువు చెయ్యాలి. అసెంబ్లీకాదు-మంత్రితో ప్రకటన ఇప్పించడానికి."

అంతా గొల్లున నవ్వారు.

ముసలి కౌన్సిలర్ ముఖం ముడుచుకుపోయింది.

"భూగర్భ పరిశోధన డిపార్టుమెంట్‌వారు ఆ విషయం ధృవపరచాలి. భూకంపం ఎక్కడా రాకుండా వాటర్‌టాంకు దగ్గరే ఎందుకు వచ్చింది అనేది ప్రశ్న? అందులోనూ ఏ ఇల్లూ, వాకిలీ పడకుండా వాటర్ టాంకే ఎందుకు పడింది-అంటే ఏం చెప్తాం?

"కాబట్టి అలా తప్పుకోడానికి వీల్లేదు" అన్నాడు భీమాంజనేయరావు

అందరూ అన్ని రకాల సలహాలు ఇచ్చారు కాని, గండం గట్టెక్కే వుపాయం ఎవరూ చెప్పలేక పోయారు.

'వీళ్ళందరివీ పీత బుర్రలు, ఒక్కళ్ళకీ సరైన ఆలోచన లేదు. ఇక తనే పూనుకోవాలి' అని అందరికీ గుడ్‌నైట్ చెప్పేసి బెడ్‌రూమ్‌లో లైట్లు ఆర్పేసి పడుకుని ఆలోచించసాగాడు.

తెల్లవార్లూ నిద్రలేకుండా ఆలోచించాడు. ఆలోచించగా ఆలోచించగా, బుర్ర బద్దలు కొట్టుకోగా కొట్టుకోగా తెల్లవారుజామున మెరుపులాంటిఆలోచన ఛైర్మన్ భీమాంజనేయరావు బుర్రలో మెరిసింది.

'అంతే! అదే వెయ్యాలి' అనుకున్నాడు.

## 5

ఛైర్మన్ భీమాంజనేయరావు కారు డాక్టర్ మనోహర్ హాస్పటల్ పోర్టికోలో ఆగింది.

లంచ్ టైము అది. డాక్టర్ క్యారేజీకోసం ఎదురుచూస్తున్నాడు. ఆ రోజు ఎందుకో ఇంటినుంచి రావడం లేటయింది.

డాక్టర్ ఏకాంతంగా కూర్చుని వుండడం చూసి ఛైర్మన్‌గారి మనసు వరదగోదావరిలా వుప్పొంగిపోయింది.

"నమస్కారం డాక్టర్‌గారూ!" అంటూ వచ్చి రెండు చేతులూ పట్టుకుని ఎంతో ఆప్యాయత కురిపిస్తూ, "బావున్నారా? పిల్లలు కులాసానా? అమ్మాయి ఏం చేస్తోంది?" వగైరా చిల్లర ప్రశ్నలు కురిపించాడు

తర్వాత అసలు పని గుర్తుకు రాగా రంగంలోకి దిగి, "ఇవి చేతులు కావు—కాళ్ళనుకోండి" అంటూ డాక్టర్ చేతులు పట్టుకున్నాడు

"చేతులు కాళ్ళు ఎట్లా అవుతాయి ఛైర్మన్‌గారూ?" అన్నాడు డాక్టర్ మనోహర్ నవ్వుతూ.

'అంటే తన కాళ్ళు పట్టుకోమని అర్థమా?' అని ఛైర్మన్‌గారి మనసు చివుక్కుమంది.

కాని ప్రిస్టేజి చూసుకోవలసిన

సమయంకాదు అది. ఎలాగైనా డాక్టర్‌ని ప్రసన్నుణ్ణి చేసుకోకపోతే తన రాజకీయ జీవితానికి శాశ్వత సమాధి కట్టబడుతుంది.

సంచిలోనుంచి కరెన్సీ తీసి డాక్టర్ ఎదురుగా పెట్టారు.

"లక్ష!" అన్నాడు ఛైర్మన్.

"ఏమిటి ఛైర్మన్‌గారూ! నా ఫీజు ఇంతా-అని తెలిసి ఆశ్చర్యంలో మునిగి పోతున్నాను. వూపిరాడ్డంలేదు సంతోషంతో. ఇంతకీ అంత క్రిటికల్ కేసు ఏమిటి? పేషెంటు ఎక్కడ?" అన్నాడు డాక్టర్.

భీమాంజనేయరావుకి కడుపు మండిపోతోంది డాక్టర్‌వైఖరిచూసి. అమాంతం గొంతు పిసికి మర్డర్ చెయ్యాలనిపించింది.

"అందుకుకాదు ఈ డబ్బు."

"మరెందుకు?" ఆశ్చర్యం ప్రకటించాడు డాక్టర్.

"మా మున్సిపాల్టీమీద మీరు వేసిన దావా వుపసంహరించుకోవాలి" అన్నాడు ఛైర్మన్.

డాక్టర్ మనోహర్ ముఖం ఎర్రగా కందగడ్డలామారిపోయింది. ఆవేశంతోలేచి నిలబ్బాన్నాడు. కరెన్సీనోట్లు ఛైర్మన్ ముందుకు నెట్టి, "సారీ మిష్టర్ భీమాంజనేయరావ్!" అన్నాడు.

"మీరు కోర్టులో గెల్చినా ఇంత కంటే ఎక్కువ వస్తుందా?" ప్రశ్నించాడు ఛైర్మన్.

"నా సంగతి అలా వుంచండి. మిగిలిన వందమంది సంగతి?"

"మీరు కేసు విత్‌డ్రా చేసుకుంటే ఇక వాళ్ళని గురించి పట్టించుకునేది ఎవరు?"

"ఇది చాల అన్యాయం."

"అన్యాయం చెయ్యకుండా డబ్బు ఎలా వస్తుంది డాక్టర్?" సూటిగా ప్రశ్నించాడు ఛైర్మన్.

"నేను ఎవరికీ అన్యాయం చెయ్యలేను."

"ఎవరికీ అన్యాయం చెయ్యకుండా మీనాన్న ఇంత ఆస్థి సంపాదించాడా? మీరు ఈ మేడలు, కార్లు కొన్నారా?" వ్యంగ్యంగా అన్నాడు ఛైర్మన్.

డాక్టర్ సీరియస్‌గా చూసి, "అనవసర్ డిస్కస్‌చేస్తూ కూర్చోవడానికి నాకు తీరికలేదు. ఇక దయ చేయండి!" కఠినంగా అన్నాడు.

ఇంతలో బాయ్ క్యారేజీ తెచ్చాడు.

"సారీ ఛైర్మన్‌గారూ! మీకు ఈ విషయంలో ఏమీ సహాయం చెయ్యలేను. దోషులు శిక్షించబడా

లవి నా వుద్దేశ్యం" అంటూ డైనింగ్ రూమ్‌లోకి చర చర నడిచాడు.

## 6

దాదాపు సంవత్సరం పాటు కోర్టులో నలిగింది కేసు.

తర్వాత ఒకరోజు డాక్టర్ మనోహర్ మధ్యాహ్నం ఇంటికి వెళ్లాడు బట్టలైనా మార్చుకోకుండా బెడ్‌రూమ్‌లో కూర్చుని ఫ్రిజ్‌లోనుంచి విస్కీ సీసాతీసి గ్లాసులోకి వంపుకుంటుంటే అతని భార్య వచ్చింది.

ఆమెకు ఏదో అర్థమైనట్లు నిట్టూర్చింది.

సాధారణంగా డాక్టర్ ఆ వేళప్పుడు ఇంటికిరాడు. వచ్చాడంటే ఏదో అసాధారణ సంఘటన జరిగి వుంటుంది.

"కేసు ఏమైంది?" అంది ఆమె.

విచారంగావున్న డాక్టర్ముఖం చూస్తే కేసు ఓడిపోయినట్లు తెలుస్తూనేవుంది. కాని, అడగాలి గనుక మామూలుగా అడిగింది.

"కేసు మనమే గెల్చాం" అన్నాడు.

"మరి అలా వున్నారేం?" ఆశ్చర్యపోతూ అడిగింది.

అతను మాట్లాడలేదు.

"జడ్జిమెంట్ ఎలా ఇచ్చారు?" కుతూహలంతో అడిగింది డాక్టర్ భార్య.

"చనిపోయినవారి కుటుంబాలకి ఐదువేల చొప్పున, గాయపడిన వారికి రెండువేలూ నష్ట పరిహారం చెల్లించాలి. సగం మున్సిపాల్టీవారూ, సగం అది కట్టిన కంట్రాక్టరూ చెల్లించాలని తీర్పు చెప్పారు."

"మొత్తం ఎంత చెల్లించాలి?"

"ఏడెనిమిది లక్షలు" అన్నాడు.

"మరికనేం? మీరు దావా వెయ్యబట్టి ఎంతోమంది లాభంపొందారు. సంతోషించాల్సింది పోయి విచారంగా వున్నారెందుకు?" నవ్వుతూ అంది ఆమె.

"వాటర్‌టాంక్ కట్టిన కంట్రాక్టర్ ఎవరోకాదు-మా నాన్నగారే" అన్నాడు డాక్టర్ మనోహర్.

గుండె ఆగిపోయి నట్లయింది డాక్టర్‌గారి భార్యకి.

"ఆ విషయం నాకు ముందే తెలిస్తే అసలు దావా వేసేవాడిని కాదు." విచారంగా అన్నాడు డాక్టర్‌మనోహర్. •